క్లుప్తంగా

మహిళా విభాగ అధ్యక్షురాలికి సన్మానం



పొదలకూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణిని శుక్రవారం నెల్లూరు పార్టీ కార్యాలయంలో పొదలకూరు బిట్ – 3 ఎంపీటీసీ సభ్యురాలు జి.లక్ష్మీకల్యాణి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. వరుదు కల్యాణి వెంట రాష్ట్ర మహిళా జోన్ అధ్యక్షురాలు కాకాణి పూజితారెడ్డి ఉన్నారు.

రాకపోకలెలా..?



రిజర్వాయర్ కట్టపై గుంతలు

వెంకటాచలం: మండలంలోని సర్వేపల్లి రిజర్వాయర్ కట్టపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో రైతులు పొలాలకు వెళ్లడంతోపాటు, అనికేపల్లి, పొట్టింపాడు, బ్రహ్మదేవి తదితర గ్రామాలకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అయితే కట్టపై అడుగడుగునా గుంతలు ఉండటంతో వాహనాల రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

ధ్యాన్‌చంద్‌కు నివాళి



పొదలకూరు: హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం నేషనల్ స్పోర్ట్స్ డేను నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బాలికలకు క్రీడా పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శైలజ, పీడీలు దేవిక, పార్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశం నేడు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశాన్ని నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించనున్నామని కమిషనర్ బాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ సుప్రజ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీ నియామకం

కోవూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కమిటీని నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనను శుక్రవారం విడుదల చేసింది. ఉపాధ్యక్షులుగా నలుగురు, ప్రధాన కార్యదర్శులుగా ఐదుగురు, కోశాధికారి, కార్యదర్శులుగా ఆరుగురు, కమిటీ సభ్యులుగా 14 మందిని నియమించారని పార్టీ మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్‌ను ఆటో ఢీకొని ఓ యువకుడు గాయపడిన ఘటన మండలంలోని సర్వేపల్లి సమీపంలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గూడూరు పట్టణానికి చెందిన శ్రీకాంత్ పని నిమిత్తం ఆటోలో ముత్తుకూరుకు వెళ్లాడు. తిరిగి గూడూరుకు బయలుదేరగా సర్వేపల్లి సమీపంలో ఆటో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్‌కు గాయపడగా స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

ఆర్థిక సాయంలో నిర్లక్ష్యం తగదు

నెల్లూరు రూరల్: పోక్సో కేసుల్లో బాధితులకు ఆర్థిక సాయాన్ని అందించడంలో నిర్లక్ష్యం తగదని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. సమగ్ర శిశు సంరక్షణ పథకం అమలుపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లల దత్తత విషయంలో నిబంధనల మేరకు చర్యలు చేపట్టాలని సూచించారు. బాల కార్మిక నిరోధక చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. బాల యాచకులను బడిలో చేర్పించాలని, దీనికి గానూ ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించాలన్నారు. ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, డీసీపీఓ సురేష్, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డి, దిశ సీఐ సుబ్బారావు, సమగ్ర శిక్ష పీడీ వెంకటసుబ్బయ్య, డీపీఓ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

కోవూరు: పట్టణంలోని యరబాక కృష్ణారెడ్డి కౌశల్యమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి పంతులు ప్రారంభించిన వ్యవహారిక భాషా ఉద్యమంపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ప్రిన్సిపల్ లక్ష్మీప్రసన్న, వైస్ ప్రిన్సిపల్స్ రామ్‌ప్రసాద్, లావణ్య, తెలుగు అధ్యాపకుడు రామ్‌కుమార్, అధ్యాపకులు మధుసూదన్‌రావు, శోభారాణి, విజయ తదితరులు పాల్గొన్నారు.

➡ పట్టణంలోని నారాయణశెట్టి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. పరీక్షల్లో తెలుగులో 99 మార్కులను సాధించిన 12 మంది విద్యార్థులకు పెద్ద బాలశిక్ష పుస్తకాలను అందజేశారు. ప్రిన్సిపల్ సికిందర్, డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల తెలుగు ఉపాధ్యాయుడు సత్యనారాయణ, అధ్యాపకులు పద్మప్రియ, మల్లసాని శ్రీనివాసులు, ప్రభాకర్, రాజ్యలక్ష్మి, పద్మజ, షఫియాభాను, మాధవకృష్ణ, శ్రీధర్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

➡ బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్‌కు తెలుగుభాషా పురస్కారం లభించింది. నెల్లూరులోని పురమందిరంలో అవార్డును ఆయన అందుకున్నారు. ఆయన్ను పలువురు అభినందించారు.

➡ తోటపల్లిగూడూరు: మండలంలోని నరుకూరు ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం తెలుగుభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు తెలుగు పద్యాలు, గేయాలపై పోటీలను నిర్వహించి విజేతులకు బహుమతులను అందించారు. విశ్రాంత తెలుగు పండితులు ఆలూరు శిరోమణి శర్మ మాట్లాడారు. ప్రాచీన, ఆధునిక కవుల చిత్రాలను ప్రదర్శించారు. తెలుగు సామెతలు, జాతీయాలు, కథల పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొణతం రఘుబాబు, నాయకులు అన్నం శ్రీనివాసులు, నావూరు వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



కోవూరు: అధ్యాపకులకు సత్కారం



కోవూరు: మాట్లాడుతున్న లక్ష్మీప్రసన్న



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: అవార్డును అందుకుంటున్న సుధీర్‌కుమార్

జాతీయ క్రీడా దినోత్సవం

విడవలూరు: స్థానిక పీఆర్‌ఆర్ – వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సుజాత మాట్లాడారు. ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకొని క్రీడల్లో నైపుణ్యం సాధించి.. అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కాంక్షించారు. అనంతరం విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. అధ్యాపకుడు ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ మధు తదితరులు పాల్గొన్నారు.



విడవలూరులో..

పంచాయతీల అభివృద్ధికి కృషి

మనుబోలు: పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ముజిబున్నీసా సర్పంచ్‌లు, అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ముందుగా మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో వివిధ శాఖల ద్వారా జరిగిన అభివృద్ధిని నమోదు చేయాలని సూచించారు.



నివాళులర్పిస్తున్న అధికారులు

గోవర్ధన్‌రెడ్డిని కలిసిన నాయకులు

మనుబోలు: మండలానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో కలిశారు. వడ్లపూడి, గొట్లపాళేనికి చెందిన ఈగా సురేష్, రమేష్, పందిపాటి రాఘవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జయరామిరెడ్డి, సంగారపు రాంప్రసాద్, వాసు, హరికృష్ణ, నాగరాజు, అలాగే జట్లకొండూరు ఉప సర్పంచ్ తులసీరామ్ గోవర్ధన్‌రెడ్డిని కలిశారు.



సందడిగా నిమజ్జనం

విడవలూరు: మండలంలోని వావిళ్లలో గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహ నిమజ్జనాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత లడ్డూ వేలాన్ని నిర్వహించగా, రూ.25 వేలకు శ్రీనివాసులు దక్కించుకున్నారు. తొలుత ఉట్టి మహోత్సవాన్ని జరిపారు. తదుపరి రామతీర్థం సమీపంలోని తీరంలో నిమజ్జనం చేశారు.



జగదేవిపేటలో వైద్య శిబిరం

ఇందుకూరుపేట: జగదేవిపేట పరిధిలోని డీఎం కండ్రికలో 104 వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు మెరుగైన ఆరోగ్య సేవలను అందించాలని సూచించారు. హెచ్‌ఐవీపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గానూ శిబిరాలు, సదస్సులను నిర్వహించాలని కోరారు. మెడికల్ ఆఫీసర్ కిశోర్ కుమార్, డిప్యూటీ హెచ్‌ఈఓ సుధాకర్‌రావు, హెల్త్ అసిస్టెంట్ మాధవ, ఏఎన్‌ఎం కల్పవల్లి, 104 సిబ్బంది లక్ష్మణ్, ఆశ వలంటీర్ హైమావతి తదితరులు పాల్గొన్నారు.



దోమల నివారణపై అవగాహన అవసరం

కొడవలూరు: దోమల నివారణపై అవగాహన అవసరమని హెచ్‌ఏ షఫీఉద్దీన్ సూచించారు. మండలంలోని మానేగుంటపాడులో ఇంటింటికీ తిరిగి ఫ్రైడే.. డ్రైడేపై అవగాహన కల్పించారు. అనంతరం దోమల నివారణ చర్యలను ప్రయోగాత్మకంగా వివరించారు. ఇంటి పరిసరాల్లో మురుగు నిల్వలు, చెత్తా చెదారాల్లేకుండా చూడాలని సూచించారు. ఏఎన్‌ఎం నదియా, ఆశ కార్యకర్తలు పద్మజ, కిశోరమ్మ పాల్గొన్నారు.



పీఏఐపై అవగాహన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పంచాయతీ అడ్వాన్స్‌డ్ ఇండెక్స్ (పీఏఐ)పై అవగాహన సదస్సును స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నారాయణరెడ్డి మాట్లాడారు. పీఏఐను సక్రమంగా అమలు చేసిన గ్రామాలకు అదనపు నిధులను ప్రభుత్వం సమకూర్చనుందని చెప్పారు. కార్యక్రమాన్ని శ్రద్ధగా నిర్వహించాలని సూచించారు. ఎంఈఓ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారాయణరెడ్డి

సహకార సంఘ కమిటీ ప్రమాణ స్వీకారం

తోటపల్లిగూడూరు: పేడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం, అభినందన సభ శుక్రవారం జరిగింది. ఇందులో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. చైర్మన్‌గా గూడూరు నారాయణ, డైరెక్టర్లుగా దేవరాల ప్రవీణ్, మేనాటి శీనయ్యల చేత అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సన్నారెడ్డి సురేష్ రెడ్డి, బొమ్మి సురేంద్ర, రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లకెళ్లి స్మార్ట్ రేషన్‌కార్డులివ్వాలి

పొదలకూరు: స్మార్ట్ రేషన్ కార్డులను సంబంధిత సచివాలయ సిబ్బంది వినియోగదారుల ఇంటి వద్దకు వెళ్లి అందజేయాలని పొదలకూరు సివిల్ సప్లైస్ డీటీ ఐ.రవి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 21,252 కార్డులున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 50 శాతం వినియోగదారులకు అందజేయడం జరిగిందన్నారు. ఇంటింటికీ వెళ్లి కార్డులను అందజేయకుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. 31వ తేదీ వరకు సచివాలయ సిబ్బంది కార్డులను అందజేస్తారన్నారు.

ఆదాయ పెంపునకు యాక్షన్ ప్లాన్

• ఎంపీడీఓ నరసింహారావు

పొదలకూరు: గ్రామ పంచాయతీల ఆదాయాన్ని పెంపొందించుకునేందుకు సర్పంచ్‌లు యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని ఎంపీడీఓ డీవీ నరసింహారావు అన్నారు. పంచాయతీ పురోగతి సూచికపై శుక్రవారం సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ సెక్రటరీలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఒకరోజు వర్క్‌షాపును నిర్వహించారు. పంచాయతీ సెక్రటరీ మల్లికార్జున ఆర్పీగా వ్యవహరించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు గ్రామ పంచాయతీలకు ఏ విధంగా నిధులు సమకూరుతాయో తెలుసుకోవాల్సిందిగా సూచించారు. పంచాయతీలు వెచ్చిస్తున్న నిధుల వివరాలతోపాటు నిధుల సమీకరణ గురించి తెలుసుకుంటే పాలన బాగుంటుందన్నారు. ఇందుకోసం ప్రభుత్వం చాలా రకాలుగా హక్కులను కల్పించడం జరిగిందన్నారు. సర్పంచ్‌లు ఆయా గ్రామాల్లో కనీస అవసరైన తాగునీరు, వీధిలైట్లు, పారిశుధ్య పనులను సక్రమంగా చేపట్టాల్సి ఉంటుందన్నారు. పంచాయతీలు కొన్ని రకాల పన్నులను విధించి ఆదాయాన్ని పెంపొందించుకునేందుకు చట్టాలున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.సుబ్బరాయుడు, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

పాత పద్ధతి కొనసాగించాలని డిమాండ్

ముత్తుకూరు(పొదలకూరు): వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీలో పాతపద్ధతిని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ శుక్రవారం ఆందోళన చేపట్టింది. మండలంలోని కప్పలదొరువు ఏటీఎస్ సెంటర్ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి ప్రణీత్ సెన్నార్ ప్రైవేట్ సెంటర్ వరకు రవాణా రంగ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టీవీవీ ప్రసాద్ మాట్లాడుతూ ఎఫ్‌సీలను ప్రైవేట్ ఏజెన్సీలు పంపిణీ చేసే విధానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోటార్ వెహికల్స్ రంగాన్ని నీరుగార్చే విధానానికి శ్రీకారం చుట్టినట్టు పేర్కొన్నారు. ఆర్టీఓ కార్యాలయాన్ని కూడా నిర్వీర్యం చేసే ప్రక్రియలో భాగంగా చెప్పారు. ర్యాలీలో సుమారు 400 మంది కార్మికులు పాల్గొని నినాదాలు చేశారు. జిల్లా కార్యదర్శి కే.సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు, కార్మికులు

పంట నమోదు తప్పనిసరి

కోవూరు: రైతులు తమ పంటను నమోదు చేసుకోవాలని కోవూరు వ్యవసాయ సహాయ సంచాలకులు అనిత కోరారు. మండలంలోని పాటూరులో గల రైతు సేవా కేంద్రంలో ఆత్మ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ లబ్ధి పొందని రైతులు వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. సస్యరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఏఓ రజని తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: వరి పంటపై శిక్షణ కార్యక్రమాన్ని మండలంలోని జగదేవిపేటలో గల రైతు సేవా కేంద్రంలో నిర్వహించారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పీడీ మురళి హాజరయ్యారు. వరిలో సమగ్ర సస్యరక్షణ, నారుమడి, నీటి యాజమాన్యం, ఎరువుల వినియోగం తదితర అంశాలపై మండల వ్యవసాయాధికారి రఘునాథ రెడ్డి అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట: మాట్లాడుతున్న మురళి

సంపూర్ణ అక్షరాస్యతే ధ్యేయం

మనుబోలు: సంపూర్ణ అక్షరాస్యతే ధ్యేయంగా పనిచేయాలని ఎంఈఓ ఓబులేసు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. మండలంలో 2,353 మంది నిరక్షరాస్యులున్నట్లు గుర్తించామన్నారు. వీరిని అక్షరాస్యులుగా చేసేందుకు 29 గ్రామాల పరిధిలో 180 మంది వలంటీర్లను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం వయోజన విద్య శిక్షకుడు రామ్మోహన్‌రావు చదువు ఎలా చెప్పాలో వివరించారు. ముఖ్యంగా రాయడం, చదవడం నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ ముజిబున్నీసా, ఏపీఓ రాజమ్మ, ఏపీఎం వజనాక్షి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వయోజన విద్య ట్రైనర్

చవితి కోలాహలం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడ దళితవాడలో..



మనుబోలు: పూజలందుకుంటున్న గణపయ్య

వెంకటాచలం: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయకచవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. తిక్కవరప్పాడు, వెంకటాచలం, కసుపూరు, కసుమూరు, సర్వేపల్లిలో గణపయ్య విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవాలు నిర్వహించారు. తిక్కవరప్పాడు గిరిజన కాలనీలో శుక్రవారం సాయంత్రం ఉట్టి మహోత్సవాన్ని నిర్వహించి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. దళితవాడలో విగ్రహ నిమజ్జన కార్యక్రమం వేడుకగా జరిగింది.

ఘనంగా ఉట్టి మహోత్సవాలు

పొదలకూరు: వినయకచవితి వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉట్టి మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తొగటివీధి, పుట్టాయగుంట సెంటర్లలో యువకులు కోలాహలంగా ఉట్టి కొట్టారు. మండలంలోని అన్ని గ్రామాల్లో చవితి వేడుకలు జరిగాయి. గ్రామోత్సవాలు నిర్వహించారు. మూడోరోజున కొందరు సంగం పెన్నానది, కండ్లేరు ఏటికాలువ తదితర ప్రాంతాలకు విగ్రహాలను తరలించి నిమజ్జనం చేశారు. పట్టణానికి చెందిన మరికొన్ని ప్రాంతాల వారు ఐదోరోజున నిమజ్జనోత్సవాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు.

➡ మనుబోలు: వినాయకచవితి సందర్భంగా వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్య విగ్రహాలకు గ్రామోత్సవాలు నిర్వహించి సమీపంలోని వాగులు, చెరువుల్లో నిమజ్జనం చేస్తున్నారు. మనుబోలులోని వివిధ మండపాల్లో కొలువుదీర్చిన విగ్రహాలకు శుక్రవారం ప్రత్యేక పూజలు చేసి అనంతరం అట్టహాసంగా గ్రామోత్సవం చేశారు. సమీపంలోని కమాల్ వంతెన వద్ద కండలేరులో నిమజ్జనం చేశారు.

➡ బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వినాయక చవితిని పురస్కరించుకొని మండలంలోని జొన్నవాడ దళితవాడలో విశేష పూజలను నిర్వహించారు. గణనాథుడి విగ్రహాన్ని విశేషంగా అలంకరించారు. భక్తులకు అన్నదానంతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు.



వెంకటాచలం: తిక్కవరప్పాడులో..



వెంకటాచలం: నిమజ్జనం చేసేందుకు తీసుకెళ్తున్న యువకులు



పొదలకూరు: నిమజ్జనానికి తరలిస్తూ..



మనుబోలు: నిమజ్జనానికి తరలిన గణనాథుడు



పొదలకూరు: ఉట్టి కొడుతున్న యువకులు